

# పాపాయి పరుగులు

**బి. అనూరాధ**

పాపాయికి తల్లిలేదు. పాపాయిని ప్రసవించి ఆమె పరలోకానికి వెళ్లిపోయింది. అయినా, పాపాయి భూమిమీద పడి కళ్లు తెరవగానే కన్నతల్లిని గుర్తుపట్టాడు. అంతే, ఆమె మళ్ళీ కనబడలేదు. పాపాయికి ఇప్పుడు పదోనెల.

మేనత్తకి పాపాయి అంటే పంచప్రాణాలూను. పాపాయిని ముద్దాడి, బొజ్జనిండా పాలుపట్టి, ఉయ్యాలలోవేసి జోకొట్టి మేనత్త లోపలికి వెళ్లింది.

పాపాయికి కలత నిద్దరలో ఎన్నో తియ్యటి కలలు వస్తున్నాయి. భావాలు పైరుగాలిలో వరిచేనులాగ పరిపరి విధాల పరుగులు పెడుతున్నాయి.

× × ×

ఎవరా గుక్కపట్టి ఏడుస్తున్నది? ఆ పసికూన ఎందుకు అలా ఏడుస్తున్నాడు? అబ్బ! అంతట్లోకే మళ్లీ బోసినవ్వుతో ఏమిటో వింతగా చూస్తున్నాడు. తనేకదా కొలనుమధ్య తామరపువ్వులో పడుకున్నాననా? ఆ ఎర్రటి తామరపువ్వు లన్నింటికీ తను ఒక్కడే అధిపతా? అసలు ఎవరు తననిక్కడ వదలివేసినారు?

అరే, పంచరంగులుగా నవ్వుతున్నాడు. ఆ బుల్లిపెదవులు కొత్త గులాబీరేకులలాగ ఎంత తళతళ మంటున్నాయో! కలువరేకులవంటి ఆ కనులలో మెరుపులు వెలుగుతున్నాయే! తామరపువ్వు మొదలూ, చిగురూ తనే కల్పించాడనా? తన చిట్టి చేతులతోటి తామరపువ్వు లోతులు వెతుకుతున్నాడు. లేతపాదాల బొటనవ్రేళ్లతో ఏవో సృష్టిస్తున్నాడు. అతని శంఖం వంటి కంఠంలో సూర్యచంద్రులు ప్రకాశిస్తున్నారు. తన బొజ్జలో ఎన్ని ఆలోచనలు; ఎందుకో అన్ని ఆలోచనలు; ఏం చేద్దామని?

పసికూన తన ప్రతిబింబం చూసుకుని కిలకిల నవ్వుతూ ఆడుతున్నాడు: ఏమి విన్యాసాలు! ప్రకృతితో కలిసి పంచమస్వరమెత్తి పాడుతున్నాడు: ఆ గాత్రంలో ఎంత సౌకుమార్యం. ఎన్ని మెలకువలు. ఏమి రాగభావతాళ సమ్మేళనం. చల్లగా పాడుతూ అంతలోనే నిద్రపోయాడు. నిద్రలో కంటున్న మధుర స్వప్నాలు ఆ మృదువైన ముఖంపై ఎలా ప్రతిఫలిస్తున్నాయో.

అదుగో, వాళ్ల అమ్మలాగవుంది తనని అక్కడనుంచి ఎత్తుకుని తీసుకు వెడుతోంది. వాళ్ల అమ్మ ఎప్పుడూ అతనిదగ్గర ఎందుకు వుండదో? నిజంగా ఆమె అమ్మేనా? మరి తను తామరపువ్వులో ఎందుకున్నాడు. అమ్మదగ్గరవుండక? అమ్మ దగ్గర వుండడమంటే తనకి ఎంత యిష్టం. తనని అమ్మ ఎలా ముద్దులు పెట్టుకుం

టోందో! ఎంత తియ్యగావుంది! ఏమి టేమిటో మధుర పదార్థాలు తినిపిస్తోంది, తియ్యటి కథలులాగ.

అమ్మ తనని ఉయ్యాలలో పడుకో బెట్టి ఊపుతోంది. ఆహా, ఎంత హాయిగా పాడుతోంది అమ్మ.

ఆమె గొంతులో సరస్వతి వీణవాయి స్తోంది. తన గొంతులో అమ్మ పాటల రసాన్ని పోసింది: తను పెద్ద అయాక ఎంత బాగా పాడతాడు!

అమ్మ తనని నిద్రపొమ్మంటోంది. తను తీరా నిద్రపోతే ఒంటరిగా, ఒక్కణ్ణే విడిచి అమ్మ వెళ్లిపోతుందేమో? తన చిట్టి గుప్పెటలో ఆమె చీరకొంగు గట్టిగా పట్టుకుని పడుకున్నాడు. ఎంతగట్టివాడు.

అమ్మ ఇంతసేపూ ఆడించి ఎందుకు ఇప్పుడు తననిచూసి ఏడుస్తోంది? తను చూస్తూ నేనిద్రపోతున్నాడు తనకీ ఏడుపు వస్తోంది. అమ్మ ఇప్పుడెక్కడికి వెళ్లాలి? అమ్మ అస్తమానూ తనదగ్గరే ఎందుకు వుండదు? అమ్మ ఎంత అందమైనది! ఇన్ని రోజులు ఎక్కడవుందో? అదుగో, తను నిద్రపోయాడనుకుని అమ్మ నెమ్మ దిగా అడుగులువేస్తూ, వెనక్కి, వెనక్కి తిరిగిచూస్తూ భయంతో, విచారంతో వెడుతోంది.

అమ్మదగ్గరవుండి తను ఎంత పెద్దవా డయాడు! అమ్మకూడా తనూ పరిగెడు తున్నాడు, కొంగుపట్టుకుని. ఆమెదగ్గర వున్న కాస్సేపటిలో ఎన్ని విద్యలు వచ్చా యతనికి అమ్మని విడిచిపెట్టకూడదు.

అమ్మ ఎక్కడికో పెద్ద చీకటిలోకి వెళ్లి పోదోంది. తనుకూడా వెళ్లడం ఎలాగ? అబ్బ ఎంత చీకటి!

అమ్మ అడుగుల చప్పుడు అనుస రిస్తూ తను కళ్లుమూసుకుని ఆమె వెనుక పరిగెడుతున్నాడు.

అరే, అమ్మ అంధకార బంధురమై పోయింది; పెద్ద అఖాతమైన సముద్రం లోకి వెళ్లిపోతోంది. తనెలాగ వెళ్లడం? మునిగిపోతే; ఊపిరి సలపదేమో? ఫర వాలేదు తనకి అమ్మ కావాలి: అమ్మ కోసం వెళ్లేవారికి అవరోధాలూ, అపాయా లూ వుండవు కెరటాలమీద గంతులు వేసుకుంటూ వెడుతున్నాడు.

ఇప్పుడొక పెద్ద ఏడారిలోకి వచ్చారు; అమ్మ ముందు, వెనకాల తను తనుకూడా వస్తూ వుండడం అమ్మకి తెలుసునా? అమ్మకీ, తనకీమధ్య ఎంతదూరంవుందో. అమ్మను కలుసుకోవడం ఎలాగ? తను పరిగెత్తలేక పోతున్నాడు. అలసట వస్తోంది.

అమ్మకీ తనకీమధ్య మళ్లీ ఏదో అంధ కారంలాగ, అఖాతంలాగ వ్యాపించింది. తను ఆకాశంలో మేఘాలతోకలిసి పరి గెడుతున్నాడు; ఎగురుతున్నాడు అబ్బ, తనకి దాహం వేస్తోంది అమ్మ తనకేసి తిరిగైనా చూడదేం?

అమ్మయ్య, వెలుతురు కనిపించింది; ఏమి వెలుగిది! అదుగో అమ్మ! అమ్మతో కూడా ఎవరో వున్నారే! అమ్మకి తను ఒక్కడేగా, ఇంకా ఎవరున్నారు? తను మేఘాల తెరలలోనుంచి చూస్తున్నాడు. తను సాహసించి రావడం చాలా చిత్రం.

అమ్మతోకూడావున్న ఆ గడ్డపాయన ఎవరు? తనకేసి వేలుపెట్టి చూపించి అమ్మనుఏమిటోఅడుగుతున్నాడు. అమ్మ ఏడుస్తోంది ఎందుకు? తనకేసి జాలిగా చూస్తోంది. ఆ ఋషీశ్వరుడులాగ, రాక్ష సుడులాగవున్న ఆయన అమ్మ చెయ్యి

పట్టుకుని బరబర లాక్కు వెడుతున్నాడు; ఎక్కడికో ?

అమ్మకీ, తనకీమధ్య పెద్ద పర్వతం అడ్డువచ్చింది. తను మేఘాలపైనుంచి కిందకి ఎప్పుడు దిగాడు ? తనింకా ఆకాశంలోనేవుంటే వాళ్లు ఎక్కడికి వెళ్లేదీ తెలిసేదే ఇప్పుడు తిరిగి అక్కడికి వెళ్లడం ఎలాగ ?

తనకి ఆకలివేస్తోంది ఈ పళ్లెరాలనిండా ఈ పళ్లు ఎక్కడివి ? అమ్మపెట్టి వెళ్లిందేమో ! అమ్మని తను ఎందుకు వదిలాడు ?

అబ్బ, తనకి నిద్రవస్తోంది. ఎంత అలిసిపోయాడు ! నిద్రలో మైమరచి నిద్రపోతున్నాడు. ఎన్నాళ్లు నిద్రపోయాడో.

ఎవరో తనని మృదువుగా తట్టిలేపుతున్నారు, అరే, అమ్మ ! నిద్రలో సాధించి అమ్మని వెతికి తెచ్చుకున్నాడు తను మునుపటికంటె ఎదిగినట్టున్నాడు

అమ్మ తియ్యనిమాటలు చెపుతూ ఏమిటేమిటో అపరూపపదార్థాలు తినమని అందిస్తోంది తను అమ్మ మెడని పువ్వుపోరాలవంటి తన బుల్లిచేతులను పెనవేశాడు. ఇంక అమ్మని వదలిపెట్టకూడదు. ఆ గడ్డపాయనని తల్చుకుంటే తనకి ఎక్కడలేని కోపమూవస్తోంది తననింక ఎప్పుడూ విడిచి వెళ్లొద్దని అమ్మని బ్రతిమాలుతున్నాడు. పాపం. అమ్మ వెక్కివెక్కి ఏడుస్తోంది. అమ్మ తనతో వుండడానికి వీలులేదట. ఆమె తనదగ్గర వుండడానికి ఆ గడ్డపాయన ఒప్పుకోడుట. తనని రెండుసార్లే చూడడానికి అనుమతిచ్చాడట. ఆమెకు తనమీద ప్రేమ ఎక్కువై పోతుందని ఆయనకి భయంట అమ్మని దేవతలాగ తామరపువ్వులుపెట్టి పూజించాలని వుంటుందే. తనకి. తనకు కనపడని అమ్మనీ— తను పోగొట్టుకున్న అమ్మని—కనపడక కనపడక ఇన్నాళ్లకి ఎలాగో కనపడితే ఇప్పుడామెను విడచిపెట్టడం ఎలాగ?

అమ్మ నెమ్మదిగా తనని జోకొడుతోంది. తప్పదు అమ్మ వెళ్లిపోవాలి. అమ్మ ఇంక రాదు. తనని కడసారిచూసి వస్తానని ఆ గడ్డపాయన దగ్గర సెలవుపుచ్చుకుని వచ్చింది, అమ్మ.

తనను జోకొడుతున్న అమ్మ కంటినీరు జీవనదులై ఎలా ప్రవహిస్తోందో ! అమ్మ చేతులు మంచులాగ చల్లగా వున్నాయి.

అబ్బ,తనకి మళ్లీనిద్రవచ్చేస్తోంది. అమ్మ గొంతులో పాటలు పల్లవిస్తున్నాయి. అమ్మ ముఖంపైమాత్రం మబ్బులు పరిగెడుతున్నాయి. అన్నీ ఏమిటో మసక మసకగా కనిపిస్తున్నాయి. తను మైమరిచి నిద్రపోయాడు.

ఎంతసేపో ఆ నిద్ర ! మెలుకువ వస్తోంది. అమ్మ ఏది ? తామరపువ్వుగా మారిపోయిందా ? ఈ కొలను అమ్మ కన్నీరేనా ?

పాపాయి కళ్లువిప్పాడు; కలకరిగి పోయింది. నలువైపులా ఆశ్చర్యంతో తేరిపారచూశాడు. తను పడుకున్న ఊయాల తామరపువ్వు అయిపోంది. చిత్రంగా, ఇంక కనబడదనుకున్న అన తల్లిని కనుక్కున్నాడు మాతృగర్భంలో నవమాసాలలో మత్స్యం మొదలు మానవుడివరకూ తను ధరించిన అవతారాలను ఒకసారి మననం చేసుకున్నాడు.

× × ×

పాపాయికి ఏడవాలని బుద్ధిపుట్టింది ; ఏడిచాడు. పాపాయిమీద పంచప్రాణాలు పెట్టుకున్న మేనత్తవచ్చి పాపాయిని జోకొట్టి, నిద్రపుచ్చి మళ్లీ లోపలికి వెళ్లింది.